# సుబ్బరామయ్య శాలువ

[నిజంగా జరిగిన కథ]

'ఇంక శాలువాను నేను ముట్టడంలేదు. గంగాభవాని కర్పణంచేశాను. నన్ను మన్నించవలసింది.' అని దండముపెట్టి చెంపలు కొట్టుకున్నాడు.

రచయిత :

## పురాణం పిచ్చయ్యశాస్త్రి

ఇది కథగాదు.

ఇంచుమించుగా నలభై యేండ్లకు ముందు జరిగినవిషయము.

నేను నెల్లూరులో చదువుకొనుచుంటిని. అప్పటి దినాలలో బ్రాహ్మణులకు హోటళ్లు యెక్కువ లేవు. ఏవో రెండుమూడు మాత్రమే యుండినవి. వానిలో వెంకట్రామయ్యగారి హోటలు ఒకటి. వెంకట్రామయ్యహోటలంటే కొంచెము మంచిపేరు. శుచిగాను, రుచిగాను, ఉండడంచేతను, వచ్చినవారిని మరియాదతో చూడడంచేతను, భోజనమున కాయనయింటికే యెక్కువగా వచ్చేవారు. ఏ యంతరాయాలు లేక వ్యాపారం సాగిపోతూవుంది.

ఆ మహాపురుషునికిగల సద్గుణముల్లో రెండు ముఖ్యమైనవి: ఎప్పుడున్నూ తాంబూలం నములుతూవుండడ మొకటి. పేకాట రెండవది. మధ్యాన్నం భోజనాలైన తరువాతనున్నూ, రాత్రి భోజనములైనతరువాతనున్నూ వెంకట్రామయ్య పేకాట అనే యానందసముద్రంలో మునిగియుండేవాడు. భోజనానికి వచ్చేవారిలోనున్నూ కొందరు చేరుచుండేవారు. ఈ వ్యాపారమునకు వచ్చేవారందఱును, ఏ పనిన్ని లేక తిరుగుచుండే మహానుభావులు. వెంకట్రామయ్యగారికి వారు పేకాట కైంకర్యములో తోడుపడి ఆయనను ధన్యునిజేస్తూ తామును ధన్యులై జీవయాత్ర గడుపుచుండేవారు. ఏయభ్యంతరమున్నూ లేక రాత్రుళ్లు పగళ్లు ఒకేరీతిగా యాటసాగుతూవుండడంవల్ల వేంకటరామయ్యకు తీరుబడియే కలిగేదికాదు. అయినను ఆయన యేనాడుగాని యొక యణాయైనను గెలిచినాడని యూరిలో చెప్పినవారుగాని, వినినవారుగాని యెవ్వరును లేరు. ఆనాటికానాడు పూటకూలివర్తకంలో సంపాదించిన డబ్బు కొంతకర్చు భోజనసామగ్రికి పోగా మిగిలింది చీట్లాటలో పోగొట్టుకొంటూవుండడంచేత యాయన గడించినడబ్బు సార్థకవినియోగంక్రింద అయిపోతూవుండేది.

ఈలాగా జరుగుచుండగా సుబ్బరామయ్యయనే పేరుగల వెలనాటి బ్రాహ్మణు డొకాయన (రక్తసంబంధముగల బంధువులెవ్వరును లేనివాడు) తనకుండిన సొత్తులమ్ముకొని రెండువేలు డబ్బు మూటగట్టుకొని రామేశ్వరంపోతూ నెల్లూరులో రైలుబండి యెక్కిపోవలెననే తలంపుతోవచ్చి పేరుగాంచిన వేంకటరామయ్య హోటలులో ప్రవేశించాడు. ఆదినాల్లో రైలు నెల్లూరువరకే యుండినది, అదిన్ని చిన్నబండి. అందువల్ల నే సుబ్బయ్య నెల్లూరుకువచ్చి రైలు యెక్కిపోవలెననుకొన్నాడు. కాని ఆయన యత్నము కొనసాగలేదు. హోటలులో చేరినంతట, తాను వంగోలుతాలూకాలో యేదో గ్రామంవాడననిన్ని, రామేశ్వరం పోవడమునకై యీదారిని వచ్చినాననిన్ని

చెప్పి నాలుగుదినాలు నెల్లూరులో నిలిచి తరువాత పోనెంచి, తన యభిప్రాయం- వేంకటరామయ్యతో చెప్పగా ఆయనకుబసకు గదిచూపి, కావలసిన యేర్పాటులను చేయించినాడు. సుబ్బరామయ్య పదిహేను రోజు లక్కడనే గడపుచుండెను.

ఈకాలంలో, వేంకటరామయ్య సుబ్బరామయ్యగార్ల నానాటికి స్నేహ మెక్కుడైనది. దీనికి ముఖ్యమైన కారణమేమంటే వెంకటరామయ్యవలెనే సుబ్బరామయ్యయు పేకాటలో నెక్కుడైన భక్తిశ్రద్ధలుగలవాడగుటయే ! అందువల్ల సుబ్బరామయ్య రామేశ్వరయాత్రమాటనే మరచిపోయెను. నెలకు పది రూపాయలు యిచ్చేలాగున్నూ, తనకు కావలసిన సౌకర్యములన్ని జరిగిస్తూవుండవలసినదనిన్ని చెప్పి యేర్పాటుచేసుకొని ఆపుణ్యాత్ముడక్కడనే స్థిరవాస మేర్పఱచుకొనెను. తనదగ్గఱఉండిన డబ్బుగిబ్బ వేంకటరామయ్యచేత యిచ్చి కావలసినపు డడిగితీసుకుంటూ వుండెను. రెండువేల రూపాయలు చేతజిక్కినందున ఆటకుగాని యితర కార్యాలకుగాని యేమిన్ని తక్కువలేకుండా జరుగుతూవచ్చెను. వేంకటరామయ్య అదృష్టమోయన్నట్లు నాలుగైదునెలలు జరిగినంతట ఉన్నట్లుండి సుబ్బరామయ్యకేదో జబ్బు కనిపించి యది యెక్కువయ్యెను. తాను జీవిం పజాలనని సుబ్బరామయ్య నిశ్చయించి వేంకటరామయ్యనుపిలిచి, నీయొద్ద యిచ్చియుండే సొమ్ములో కొంత కర్చుపెట్టి కర్మచేయించి కొంత తనపేర ఏదయిన ధర్మమునకు వినియోగపెట్టవలసిందని చెప్పి ప్రాణములు విడిచెను. రెండునెలలు గడచినవి.

సుబ్బరామయ్య చెప్పిన యేర్పాటుప్రకారం వేంకట్రామయ్యయొక పనినికూడా చేయలేదు. రెండువేల రూపాయలు దొరికినవిగదాయని సంతుష్టిని బొందిఉండెను. సుబ్బరామయ్య చనిపోయినపు డతని తలక్రింద గుడ్డలమూట యొకటి యుండెను. దానిని వేంకట్రామయ్య విప్పిచూడగా అందులో అందమైన కాశీశాల్వ యొకటి యుండినది. చూచినవారు యించుమించు మున్నదిరూరూపాయల వెలగలదిగానుండవచ్చునని మతింపువేసి చెప్పిరి. తక్కినవేవో రెండుమూడు గుడ్డలున్నూ ఉండినవి. వాటినంతా వాళ్ళవాళ్ళకు పనివాండ్లకిచ్చి వేంకట్రామయ్య శాలువమాత్రం స్వంతవినియోగార్థం పెట్టుకొనెను.

అది చలికాలముగా యున్నందున దానిని నిండా ఆశతో కప్పుకొని ముందరి గుమ్మములోన మంచముమీద హాయిగా పండుకొనెను. ప్రక్కగోడకు తగిలించి చిన్నదిగాజేసియుండే దీపము మినుకు మినుకున వెలుగుచుండెను. ఎక్కడివారక్కడ యనుకూలమైన చోట్లల్లో పండుకొని అలసి గుఱకలుపెట్టుచు నిద్రించుచుండిరి. రాత్రి సుమారు ఒంటిగంటయైనది. అపుడొక విచిత్రసంభవంజరిగింది.

ఉన్నట్టుండి, ఆయన పండుకొనియుండే మంచము నెవ్వరో పట్టియూచినట్లుగా ఉన్నట్లూగింది. తటాలున వేంకట్రామయ్యకు మెలకువకలిగి వెలికల పండుకొనియుండినవాడున్నట్లే కండ్లు తెఱచి చూచెను. ఒక మనుష్యుడు మంచమునకు దగ్గఱగా నిలిచియున్నట్లు కనబడెను. సుబ్బరామయ్యయే ప్రత్యక్షమైనాడు. స్పష్టముగా సుబ్బరామయ్యయే. చూడగానే వెంకట్రామయ్యకు భయముగలిగినది. ఒడలు వడకుబుట్టినది. నోటిలో తేమ లేదు. పలుకుటకుగాని, యెవరినైన పిలుచుటకుగాని, తుదకు పొరలుటకుగాని, ఆయనకు శక్యముకాలేదు. కొయ్యబాఱెను. తనలో 'అయ్యో ! సుబ్బరామయ్య — సుబ్బరామయ్య — చచ్చినాను — చచ్చినాను — దేవుడా! నీవేగతి' యని తలంచుకొనుచు కదలలేక, కన్నులు మూతబడక, దృష్టి సుబ్బరామయ్యరూపముమీద నిలిపి చూచుచుండెను.

రెండుమూడు నిమిషములు క్రిందనిలిచియుండిన సుబ్బరామయ్య చివాలున, యాయయ్యగారి రొమ్ముపై రెండువైపులా రెండుకాళ్లు బెట్టుకొని గుఱ్ఱమెక్కినట్లుగా కూర్చుండి, ఉగ్రమైన చూపులతో చూచుచు, 'ఇవ్వు —నారూపాయలు యేంచేశావు? తే! నాశాల్వా! నాకు యెంతో ముచ్చటగానుండే యీశాల్వా—ఎందుకు నీవు కప్పుకొన్నావ్ — కప్పుకొంటావ్ —

ఇవన్నీ నీసొమ్మనుకున్నావా?— నా రూపాయలున్నూ, శాల్వాయున్నూ యివ్వకుంటే నిన్ను చంపుతాను-- బ్రతక నీను— ఇచ్చివెయ్ —ఇచ్చివెయ్' అని బ్రతికియున్నప్పటిలాగే, స్పష్టముగా పలుకుతూ హింస చేయడం మొదలుపెట్టెను. ఆమాటలన్నీ వేంకట్రామయ్యకు గట్టిగా వినబడుతూవున్నాయి. కదలడానికి, పలకడానికి శక్యంకాలేదు, ఏమి చేస్తాడుయింక? పాపము- ఆప్రకారం బాధిస్తుంటే పడరాని యాతనకు లోనైనాడు వేంకట్రామయ్య. ఆబాధ ఆయనకే తెలుసు. రొమ్ము అదుముతుంటే—గొంతు నొక్కుతుంటే—ప్రాణము లప్పుడే యెగిరిపోయ్యేరీతిగా వుండిం దాతడికి. ఆలా వెతపడుతూవుండే సమయంలో యింట్లో మఱియెవ్వరో మేలుకొని యూవెంబడిగాలేచి వచ్చారు బయటపోవడానికి. వారు మంచందగ్గిరికి రాగానే సుబ్బరామయ్య మాయమయ్యాడు.

పోయినట్లుండిన ఊపిరి మళ్ళీ వచ్చింది. ప్రాణాలు దక్కాయి. కష్టసముద్రంలోనుండి గడిచి గట్టెక్కాడు వెంకట్రామయ్య. నాలుగు గంటలు కావచ్చింది. ఎవరికిన్ని చెప్పినవాడుకాడు తన సమాచారమును. లోపలభయం—బయటికి ధైర్యం—మఱి నిద్రలేదు. ఎట్లు వస్తుంది? అంతటిబాధ అనుభవించినవానికి? తనలో యేమేమో ఆలోచిస్తూ, దీపము పెద్దదిచేసి, మంచముమీదనుండక వాకిటికిపోయి కూర్చున్నాడు యోచనచేస్తూను. అంతలో కడుపులో యేమో వికారముపుట్టింది. గళబిళమని కలిగింది పేగులలోశబ్దం. పెరటికిపోవలసినట్లు తొందఱయేర్పడింది. పోయి వచ్చాడు. అదేమొదలు. ఒకటే వాంతులు—ఒకటే విరేచనాలు. సొక్కిపోయ్యాడు. కండ్లు గుంటలు పడ్డాయి. తెల్లవారింది. వేంకట్రామయ్యను చూస్తే పీనుగమొగంపడింది. కారణం యెవరికి తెలీదు. ఆయన చెప్పలేదు. వైద్యులచేత మందులు మాకులు ఆయనభార్యా, వాళ్లు ఇప్పిస్తున్నారు. ఏమిన్ని గుణంలేదు. వాంతులు, విరేచనా లెక్కువగానేయున్నవి. అపుడు వేంకట్రామయ్య భార్యనుపిలిచి పసుపునీళ్ళల్లో తడిపిన గుడ్డను తెప్పించి రూపాయలు పేకాటలోను, యితర కార్యాలకు కర్చుపడిపోయినవనిన్నీ, యేలాగైన రెండుమూడు నెలల్లో సంపాదించి వడ్డీతోకూడా చేర్చి ముందు చెప్పినట్లు పనులు చేస్తాననిన్నీ, శాలువ నెవనికైనా దానంగా యిచ్చేస్తాననిన్ని ప్రార్థన జేసికొని రెండు రూపాయలు పసుపుగుడ్డలో పెట్టి సుబ్బరామయ్యపేరిట ముడుపుగట్టి, సాంబ్రాణిపొగ వేసి మ్రొక్కుకొన్నాడు.

వేంకట్రామయ్య ఈగాబరాలో ఉండేటప్పుడు, నెల్లూరుకు తూర్పు పదిమైళ్ళలోనుండే గ్రామమునుంచి ఆయన మేనల్లుడు (కూతురినిచ్చిన అల్లుడుకూడాను) యేదోపనిగలిగి నెల్లూరికివచ్చి అత్తమామలను చూచిపోవలెనని వారి యింటికి వచ్చినాడు. ఆయనపేరు రాఘవయ్య. అతడు వచ్చి చూడగా మామగారు ఎక్కుడు బాధపడుతూవుండడం చూచి గాబరాపడ్డాడు. వాంతులు, విరేచనాలు అని తెలిసింది. పోలేక నాలుగునాళ్లు అక్కడనే వుపచరిస్తూ వుండినాడు. వేంకట్రామయ్యకు కొంచెం నెమ్మది యేర్పడింది. రాఘవయ్య తనయూరికి పోవడానికి ప్రయాణమైనాడు. అపుడు వేంకట్రామయ్య యోచనచేసినాడు, తనదగ్గఱవుండే శాలువా యితరుల కివ్వడంకంటే అల్లుడికే యివ్వడం మంచిది అని. రహస్యం చెప్పకుండా (చెప్పితే పుచ్చుకోడని) తనరొమ్ముపై సుబ్బరామయ్య యెక్కినమఱునాటి యుదయాన్నే మడిచి దూరముగా దూలంమీద గుడ్డలోచుట్టిపెట్టియున్న శాలువాను తాను తాకకుండా యింకొకరిచే తెప్పించి అల్లుడికిప్పించి 'మంచి శాలువ. దీనిని నీవు వాడుకో' అని చెప్పి యిప్పించెను.

రాఘవయ్య దాన్నిచూచి యుబ్బిపోయినాడు. వెలగలది—అందమైనది. మామ తనకంత గొప్ప బహుమానం చేసినాడని, కృతజ్ఞతకు సూచనగా మందహాసంచేసి శాలువాగొని తమగ్రామానికి పోయి. ఆరాత్రి మామయిచ్చిన శాలువా కప్పుకొని, సంతోషంతో పండుకొన్నాడు. అర్ధరాత్రి యై

[మిగతా ౧౦౨-వ పేజీలో.

# సుబ్బరామయ్య శాలువ

[౭౬-వ పేజీ తరువాయి]

నది. కడుపులో వికారంపుట్టింది రాఘవయ్యకు. ఆరంభమైంది గుడగుడ - కడిబిడ - ఒకే వాంతులు- మొడ, తల నొప్పి- విరేచనాలు- పడరాని బాధపడినాడు. తెల్లవారింది. ఇంటిలోనివారు, అల్లునికి నిండా జబ్బుగా ఉన్నదని నెల్లూరికి, వేంకటరామయ్యకు జాబువ్రాసి పంపించేరు. ఆయన ఆయుత్తరంచూచుకొని తాను రావడమునకు బదులుగా జవాబు ఉత్తరం వ్రాసిపంపెను. చదువుకొనగా అందులో 'భయపడవలదు. శాలువాను మడిచి దూరముగా పెట్టవలెను. దానిని ఇంక ముట్టవద్దు- ఎవరికైనా యిచ్చినా మంచిదే! వాంతులు, విరేచనాలు నిలుచును. వేరే మందు మాకు లేవిన్ని అక్కరలేదు. తెలియవలెను' అని వ్రాయబడి యుండెను. కారణం తెలుపలేదు. అయినప్పటికి యేదో దీనిలో మోసం కలిగియుండాలెనని యెంచి రాఘవయ్య శాలువనుమడిచి దూలము మీదబెట్టి చెంపలు గొట్టుకొనెను. అట్లుచేయడంవల్ల కొంత తగ్గినదేగాని, వాంతిభేదులు పూర్తిగా నిలువలేదు. ఇంటిలోనివారు, 'పాడుశాలువ నొకదానిని తెచ్చావు. ఈ యవస్థయేర్పడింది. యిందులో యేదో రహస్యండుంది. తెలిసియుండే నీమామ నీకు దీనిచ్చాడు. లేకుంటే యింతమంచిదాని నిచ్చేవాడేనా? చాలుచాలు ఆయన బహుమానం. అది మనయింట్లోనే వుండకూడదు ఎవరికైన యివ్వడంగాని, ఆయనకే పంపెయ్యడంగాని చేయవలసింది' అని తొందరపెట్టడానికి మొదలుపెట్టారు. రాఘవయ్యకున్నూ వాళ్లు చెప్పినట్లే తోచింది. కాని, మళ్లీ మామకు పంపడం మఱియాదగా నుండదనీ, యెవళ్ళకయినా యోగ్యులుగా చూచియిస్తే పోతుందని నిశ్చయం చేసుకొన్నాడు.

ఆగ్రామంలో వేంకటరమణయ్య అనేవాడొకడుగలడు. అతఁడు సదాశివపూజయు, యితర దేవతార్చనయు చేయుచుండేవాడు. వేకువననే లేచి చన్నీళ్ళలో స్నానంచేసి మడుగు గట్టుకొని, శివపూజజపము చేయుచుండేవాడు. అది ధనుర్మాసం కాబట్టి ఆయన కొంచెముందుగానే నిద్రలేచి స్నానంచేసి కూర్చుండి శివపూజ గావించుచుండెను. ఆసమయంలో రాఘవయ్య శాలువాగొనిపోయి 'మీరు తపస్సుజేసుకొనేవారు. అర్హులు—అగుటచే యిది మీకు బహుమతిగా యివ్వడం మంచిదని యెంచి తెచ్చినాను' అని యెంచి శాలువా ఆయనకు కప్పి నమస్కారంచేసి యింటికి పోయెను. ఒట్టుబెట్టినట్లు రాఘవయ్యకు గలిగియుండిన బాధలన్నీ మాయమైనాయి.

వేంకటరమణయ్య తలపనితలంపుగా తనకంతటి మంచి శాలువ దొరికినందుకు సంతోషించి రాఘవయ్యకు తనయందు గలిగిన భక్తికై అతణ్ణి మెచ్చుకొనెను. నాటిరాత్రి కప్పుకొని పండుకొనెను. ఇంకా నిద్రపట్టెనో లేదో, అంతే! ఆరంభమైనాయి, విరేచనాలు, వాంతులు. కడుపులోమంట— వికారము— తాళలేక పోయాడు. కొంచెం బుద్ధిమంతుడు కనుక ఆలోచించాడు. 'ఏదో కారణం లేకపోతే యింతమంచి శాలువాను—వెలగలదానిని- ఆతను నాకు యివ్వడం యెందుకు? అడిగితినా? మోసముగా తోచుచున్నది' అని తటాలున దానినితీసి మడిచి దూరముగా బెట్టినాడు. ఉత్తరక్షణంలో అన్నిసంకటాలు నివర్తి. అరే! మోసంచేశాడు నిజంగా మోసమేరా — అనుకొన్నాడు. కాని రాఘవయ్యతో ఆప్రస్తాపం యేమిన్ని చేయలేదు. శాలువను తనయింట్లో నుంచరాదనీ యెవళ్ళకయినా యివ్వడం మంచిదనీ, ఆలోచించాడు ఆభక్తుడు.

ఆగ్రామానికి రెండుమైళ్ళ దూరములోగల మఱియొక పల్లెనుండి ప్రతిదినమున్నూ ఉపాదానమునకై యొక బ్రాహ్మణుడు వస్తూవుండేవాడు. ఆయనను సుబ్బన్న అంటారు. ఆబ్రాహ్మడు భిక్షానికి తన

యింటికి వచ్చినతోడనే వేంకటరమణయ్య శాలువా తెచ్చియిచ్చి 'ఇది నీకుయివ్వాలని బుద్ధిపుట్టింది. పిల్లలుగల పేదవాడివి- చలికాలం -హాయిగా కప్పుకో' అని ఆదరంతో చెప్పాడు.

దేవుడు తనకు మేలుచేశాడనీ, తాను బయలుదేరివచ్చిన కాలం మంచిదనీ, సంతోషించాడా చాదస్తపు సుబ్బన్న. అతడికీమోసం తెలియదు,పాపము. శాలువను గొనిపోయినరాత్రి, తానున్ను, బిడ్డలున్నూ కప్పుకొని పండుకొన్నారు, కుతూహలంతో- ఒకేసారి అందరికి మొదలుపెట్టాయి వాంతులు-భేదులు- తెల్లవారేవరకు వారు పడినపాటు యింతింతగాదు. భగవంతుడికి యెరుక, తెల్లవారినంతట సుబ్బన్నభార్య కొంచెం తెలివిగలదగుటచే యోచించింది. ఆమెకేదో సందేహంకలిగింది. మొగుణ్ణి పిలిచి 'ఈశాలువా తెచ్చినవేళ మంచిదికాదు. దీనివల్లనే యేర్పడింది యీకష్టమంతా మనకు. ఏదో కారణంచేత యింత కరీదుగలదాని నిచ్చియుంటారుగాని లేకుంటె మనబోటివారి కిస్తారా? మనచింపిరిగుడ్డలే మనకు చాలును. ఈశాలువను యెత్తుకొనిపోయి, ఎవరు యిచ్చినారో వారికేయిచ్చిరండి'—అని తొందరపెట్టగా, సుబ్బన్న కొనిపోయి, వెంకటరమణయ్య యింట్లో లేనితరుణంలో యెవరికిన్ని తెలియకుండా వారియింటి దూలముపై బెట్టిపోయెను.

ఇంతలో వెంకటరమణయ్య ఇంటికివచ్చాడు.

వెంకటరమణయ్య యింట్లో ప్రవేశించాడో లేదో వికారం—విరేచనాలు-- ఆరంభం అయినాయి. సాయంత్రంవరకు అల్లాడినాడు. కారణంతోచలేదు. చీకటిపడినది. 'ఈరాత్రి యెట్లాగడుస్తుందిరా భగవంతుడా' అనుకొంటూ దిగులుపడ్డాడు. ఆలోచించాడు కొంచెముసేపు ఆపాడుశాలువా మళ్ళీ వచ్చియుంటుందేమోయని మెల్లగాలేచి నాలుగుతట్లా వెదకినాడు. కనుపడింది శాలువా దూలముమీద. అరే చచ్చానే, దీని తస్సాకొయ్యా. వచ్చిందే మళ్ళీ యిది యింటిలోకి ? ఏమిచేసేది? 'ఓరి సుబ్బన్నా! నాకు తెలియకుండానే యెంతపని చేశావురా!' అంటూ ఊళ్లో అందఱు నిద్రపొయ్యేదాకను యెట్లానో గడిపినాడు. ముందులాగు విరేచనాలు వాంతులుమాత్రమేగాక యిపుడు శాలువ సొంతగాని రూపంకూడా కనపడ్డానికి మొదలుపెట్టినది. సుబ్బరామయ్య నాశాలువా యెందుకు తెచ్చిపెట్టుకున్నావు? నీయబ్బసొమ్మనుకున్నావా? నిన్ను చంపేస్తా' అనే మాటలు వినడమూ, ఈతట్టుకు ఆతట్టుకూ యెదటతిరగడమూ వెంకటరమణయ్యకు, ఎక్కువ భయం కలిగింది. శాలువా యెత్తుకొనిపోయి తనకు యిచ్చిన రాఘవయ్య యింట్లో పెట్టాలె ననుకొన్నాడు. దాన్నిచుట్టి సంకలోపెట్టుకొని వారి వాకిటికిపోయాడు. తలుపు మూసిఉన్నది. లోపల అందఱు మంచి నిద్రలో గుఱకలు పెడుతూవున్నారు. ఆసమయంతో వాకిటి యరుగుపై కెక్కి మారుసందులో నుండి శాలువాగోడపైగా లోపలికి చొప్పించి, దేవుడికి దండము బెట్టుకొని తనయిల్లు చేరుకొన్నాడు. ఆయన బాధ తగ్గినది.

రాఘవయ్యకు గాఢమైననిద్ర. ఏదో భయంకరంగానుండే కలగన్నాడు. ప్రేలుతూ కలవరిస్తున్నాడు. కడుపులో ఓర్చుకోరాని వికారంపుట్టింది. మేలుకొన్నాడు. గుండెలమీద మనిషి కూర్చున్నట్లు బళువుగా తోచినది. లేచికూర్చున్నాడు. మొదటిజాడ్యం మళ్ళీ ప్రారంభించింది. తనకు యెదుట యెవడో నిలిచియున్నట్లు తోచింది. దొంగయేమో ననుకొని 'ఎవరు? నిలిచియుండేది?' అన్నాడు రాఘవయ్య. 'ఎఱుగవా నన్ను? నేను సుబ్బరామయ్యను. నాశాలువా నాకు ఇచ్చివెయ్యి. లేకుంటే చంపుతాను, ఏమంటావు?' ఈమాటలు స్పష్టంగా విన్నాడు రాఘవయ్య. రూపంకూడా చూచాడు. యేమీతోచకుండా తత్తఱిల్లుతూ, నిద్రపోతూవున్న తల్లిని లేపాడు. 'అమ్మో! నేను బ్రతుకలేను. చచ్చిపోతాను. ఎట్లో కాని శాలువ మళ్ళీ మనయిల్లు చేరినట్లున్నది- దీపం వెలిగించి, యెక్కడనయినా పెట్టియున్నదేమోచూడు- వెంకటరమణయ్య దానిగుణం తెలిసికొని మ

నకు తెలియకుండా పెట్టి పోయినాడేమో' అనెను- అతనితల్లి దీపం తెచ్చి నలుమూలలు వెదకింది- కనపడలేదు- పైనచూడడంగోడపైనున్నట్లు తోచింది- బాగా చూచింది- ఔను! అదే! ఆశాలువే! అని తెలుసుకొన్నది- 'ఒరే! నాయనా! ఔనురా! అదిగో! గోడమీద కూర్చునిఉన్నది. పాడు శాలువ. ఇది నాశనంగాను, యెట్లువచ్చిందోగాని' అన్నది ఆమె. 'దానిని కఱ్ఱతో క్రిందదోసి వాకిట పారెయి' అన్నాడు రాఘవయ్య. 'అయ్యో! నేను దానిదగ్గఱకు కూడాపోను. అబ్బబ్బ! భయంవేస్తున్నది. నావల్లకాదు' అని యామె తడబడుతూ దూరంగా పోయి నిలిచింది. అంతట రాఘవయ్య ప్రాణానికి తెగించి ముక్కుతూ, మూలుగుతూ లేచి మెల్లగాపోయి కఱ్ఱతోదాన్ని క్రిందికిదీసి యెత్తుకొని యపుడే వెంకటరమణయ్య యింటి దగ్గరకరిగి, వెలిశగుండా లోపలికి వేసి వచ్చి పండుకున్నాడు.

అప్పుడు వెంకటరమణయ్యకు ముందటివలె లక్షణాలు కనపడ్డాయి, క్రిందుమీదైనాడు. 'ఓహో! ఇవి శాలువావల్ల గలిగిన గుణమే! సందేహంలేదు మళ్ళీవచ్చి చేరినట్లుంది యింట్లో! ఆరాఘవయ్యముండాకొడుకు, తనయింట్లో నేను పెట్టివచ్చింది తెలుసుకొని దాన్ని తెచ్చి నాయింట్లో పడేసి పోయియుంటాడు' అని వెదికాడు. ఒకచోట శాలువా పడిఉన్నది దాన్ని చూడగానే గుండె టారుమన్నది. ఆలోచించాడు. సంకటపడుతూనే దాన్నెత్తుకొని గ్రామానికరమైలు దూరంలోఉండే వాగుకుపోయి, తొడలబంటి నీటిలో మట్టితోడి శాలువ నందులోనుంచి బిగదొక్కి, వెడలి గట్టెక్కి. 'ఇంక శాలువాను నేను ముట్టడంలేదు. గంగాభవాని కర్పణంచేశాను. నన్ను మన్నించవలసింది' అని దండముపెట్టి చెంపలు కొట్టుకొన్నాడు.

'బ్రతికావుపో' అనేమాట అతనికపుడు వినపడ్డది- కాని రూపంయేదిన్ని కనపడలేదు-

వెంకటరమణయ్య యరుణోదయానికి యిల్లుచేరుకొన్నాడు- పిమ్మట యేమిన్నిలేదు- హోటలు యజమానుడైన వెంకట్రామయ్యకు, సుబ్బరామయ్యయిచ్చిన రూపాయలు సంపాదించుటకు శక్తిలేక, నానాబాధలు పడుతూ కృశించి కృశించి నాలుగైదేండ్లకు తరువాత తానున్నూ రూపాయలిచ్చి సుబ్బరామయ్య పోయినచోటికి పోయి చేరినాడు.

అచ్చట స్నేహితులుగానుండిన వారలిరువురును యెట్లు సమాధానము చేసికొన్నది మాత్రము యెవరికిని దెలియదు-

ఇందుచేత గలిగిన విశేషం యేమంటే, అక్కడ యెన్నాళ్ళనుండియో వాడుకగా ఉపాదానానికి వస్తూవుండిన సుబ్బన్న, ఒకవేళశాలువాను తనకు తిరిగి అంటకట్టుదురేమోనని భయపడి ఆగ్రామానికి రావడమే చాలించాడు-

దయ్యములు, పిశాచాలు లేవని వాదంచేసే నామిత్రులు యీ వృత్తాంతమును చదివినంతట యేమి నిర్ధారణ చేయుదురో చూడవలె.

---

పైమాసపు ఆంధ్రభూమి

# ఆకుకూరల ప్రత్యేకసంచిక

---

Printed at the Andhrabhumi Printing Works, 36 Mukatal Street. Vepery P.O, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.